క్లుప్తంగా

నడక ఆరోగ్యానికి ఎంతో మేలు

మునగపాక : మారుతున్న కాలంతో పాటు ప్రతీ ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని వ్యాపారవేత్త ఆడారి రాజు కోరారు. మునగపాకకు చెందిన పలువురు యువకులు క్రమం తప్పకుండా నెలల తరబడి వాకింగ్ చేస్తుండడంతో వారిని ప్రోత్సహించేందుకు రాజు అతని మిత్రులు బుధవారం బహుమతులు అందజేశారు. ప్రతి ఒక్కరూ రోజులో కొంతసేపైనా వ్యాయామం, నడకకు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో కోరుకొండ ప్రసాద్, గోవింద, జగన్నాథరావు, మహేష్ పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి సత్కారం



వైద్య సిబ్బందిని సత్కరిస్తున్న బ్రహ్మకుమారీలు

మునగపాక : కరోనా సమయంలో మెరుగైన సేవలందించిన నాగులాపల్లి వైద్య సిబ్బందిని బుధవారం బ్రహ్మకుమారీలు ఘనంగా సత్కరించారు. ప్రజలకు కష్టకాలంలో సేవలందించినందుకు గాను వైద్య సిబ్బంది శరగడం అప్పలనాయుడు, పద్మ,కుమార్, అరుణ,లక్ష్మి,శ్రావణి, చంద్రకాంతలకు మెమెంటో అందజేసి సత్కరించారు. అనకాపల్లి గవరపాలేనికి చెందిన మెడికల్ వింగ్ బ్రహ్మకుమారీలు విద్య, లతల ఆధ్వర్యంలో నాగులాపల్లి సచివాలయం వద్ద సత్కారం నిర్వహించారు.

తోటాడలో ఉపాధి పనులు ప్రారంభం



తోటాడలో ఉపాధిహామీ పథకం పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ మంగవేణి

మునగపాక : తోటాడలో ఉపాధి హామీ పథకం పనులను సర్పంచ్ దొడ్డి మంగవేణి బుధవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ జాబ్‌కార్డులు అందజేస్తామన్నారు. ఈ పథకం ద్వారా పలు అభివృద్ధి పనులు చేపట్టవచ్చన్నారు. పనిచేసే కూలీలకు సకాలంలో వేతనాలు అందుతాయన్నారు. ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నేతలు షేక్ ఇస్మాయిల్,దొడ్డి బాలాజీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ కాకర దేవి

ఎస్.రాయవరం : క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని జెడ్పీటీసీ కాకర దేవి అన్నారు. ఎస్.రాయవరంలో గంధామావాస్య వేడుక సందర్భంగా ఎస్.రాయవరం జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను బుధవారం ప్రారంభించారు. ప్రతిఏడాది ఎస్.రాయవరంలో గంధామావాస్య వేడుక ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ మేరకు క్రీడల పోటీలు నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ తెలిపింది. కార్యక్రమంలో సర్పంచ్ భూపతి అప్పారావు, ఎంపీటీసీ బైపా శ్రీనువాసరావు, వైఎస్సార్‌సీపీ మండలశాఖ అధ్యక్షుడు కొణతాల శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ ఆదిమూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకుడు కుర్రా కాశి పాల్గొన్నారు.

ఉపాధి హామీతో అభివృద్ధి

మునగపాక : జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా మునగపాకలో పలు అభివృద్ధి పనులు జరిగాయని సర్పంచ్ దిమ్మల అప్పారావు అన్నారు. ఈ పథకాన్ని కూలీలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మునగపాక పంచాయతీ కార్యాలయంలో బుధవారం ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్ సభ నిర్వహించారు. అప్పారావు మాట్లాడుతూ వలస కూలీలను నివారించేందుకు ఈ పథకం దోహదపడుతుందన్నారు. కాలువలు,చెరువులు అభివృద్ధి జరుగుతోందన్నారు. ఏపీవో ఎరకయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీడీవో రవికుమార్, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ, మార్కెట్‌కమిటీ చైర్‌పర్సన్ పిల్లి కనకలక్ష్మి అప్పారావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు, సచివాలయాల మండల కన్వీనర్ గణేష్,ఉప సర్పంచ్ సత్యనారాయణ, ఉత్సవకమిటీ చైర్మన్ అప్పలనాయుడు, ఫీల్డ్ అసిస్టెంట్ గోవింద పాల్గొన్నారు.

ఆదర్శనీయుడు జగ్జీవన్‌రామ్



జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి



బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న గవర కార్పొరేషన్ చైర్మన్ ప్రసాద్



బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు తదితరులు



శ్రీరాంపురం బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న విగ్రహ దాత చిక్కాల రామారావు

- ఎమ్మెల్యే గొల్ల బాబూరావు
- బాబూ జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళులు

కోటవురట్ల : బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు యువత పాటు పడాలని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. కైలాసపట్నం శివారు రాజగోపాలపురంలో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు బుధవారం నిర్వహించారు. బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మహనీయులను అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. పిల్లలను బాగా చదివించాలని, విద్యతోనే ఉన్నతి సాధ్యమన్నారు. అప్పుడే మహనీయులకు నిజమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, జెడ్పీటీసీ సిద్దాబత్తుల ఉమాదేవి, సర్పంచ్‌లు పెన్నాడ నూకరత్నం, అనిల్ కుమార్, పార్టీ నాయకులు సత్తిబాబు, నాగేశ్వరరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు వెంకటలక్ష్మి, నాయకుడు రాంబాబు, డీవీ యువసేన అధ్యక్షుడు చామంతుల శ్రీనివాసరావు పాల్గొన్నారు. రాట్నాలపాలెం గ్రామంలో డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ శాసన మండలి సభ్యుడు సూర్యనారాయణరాజు, వైస్ ఎంపీపీ సీతబాబురాజు, సర్పంచ్ అనిల్, ఎంపీటీసీ రాంబాబు పాల్గొన్నారు.

యలమంచిలి (మునగపాక): స్వాతంత్ర్య ఉద్యమంలో బాబూజగ్జీవన్ పాత్ర ఎంతో కీలకమైందని యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి అన్నారు. భారత మాజీ ప్రధానమంత్రి బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా బుధవారం మున్సిపల్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి రమాకుమారి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతదేశ ఉప ప్రధానిగా ఆయన విశేష సేవలందించారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సంధ్యా రాము, కౌన్సిలర్లు ప్రగడ రమణ, పడాల శ్రీను, మార్కెటింగ్ డైరెక్టర్ కొండబాబు, వైఎస్సార్‌సీపీ నేత కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

మునగపాక: ప్రతి ఒక్కరూ మాజీ ఉప ప్రధానమంత్రి బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు పాటుపడాలని ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ పిలుపునిచ్చారు. మునగపాక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో అంబేద్కరిజమ్ పునాది అసోసియేషన్ కన్వీనర్ రాజాన బుజ్జి ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్‌కు జయంతి జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద బుధవారం ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు గుంట్ల అప్పారావు, సూరిశెట్టి కన్నారావు, ద్వారపురెడ్డి బాబ్జీ, దొడ్డి బుజ్జి, దాడి వీరమహాలక్ష్మినాయుడు, రాపేటి పరమేష్, వేగి లక్ష్మణరావు,కరణం గణేష్ పాల్గొన్నారు.

శ్రీరాంపురంలో జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ

పాయకరావుపేట : మండలంలోని శ్రీరాంపురం గ్రామంలో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు ఆవిష్కరించారు. విగ్రహ దాత అయిన చిక్కాల రామారావును గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త వలివెల అశోక్ బాబు, మాజీ సర్పంచ్ వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు బోడపాటి గోవిందు పాల్గొన్నారు. పట్టణంలో చిత్రమందిర్ సెంటర్ వద్ద, కేశవరం గ్రామంలోను బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద ఎంఆర్‌పీఎస్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఎంఆర్‌పీఎస్ నాయకుడు తుమ్మలపల్లి కుమార్ పాల్గొన్నారు. అరట్లకోట, మంగవరం గ్రామాల్లోనూ జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. ఎంఆర్‌పీఎస్ నాయకుడు కుందూరు కుమార్, కాంగ్రెసు పార్టీ అధికార ప్రతినిధి జగతా శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా వమ్మవరంలో సర్పంచ్ పాలపర్తి పాపారావు, ఎంపీటీసీ బాల నూరిబాబు, పెనుగొల్లులో సర్పంచ్ ఉద్దండం నాగశ్రీదేవి, దార్లపూడిలో మాజీ జెడ్పీటీసీ కొంకోట నీలేంద్రరావు తదితరులు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు గొంతిన సత్యనారాయణ, ఉద్దండం సూర్యనారాయణ పాల్గొన్నారు.



వమ్మవరంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న సర్పంచ్ పాపారావు

రాంబిల్లి: జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా దిమిలి, రాంబిల్లిలో జగ్జీవన్‌రామ్ విగ్రహం, చిత్రపటాలకు పూలమాలలు వేసి పలువురు నివాళులర్పించారు. పలుచోట్ల అన్నసమారాధనలు జరిపారు.

కళాసీలకు న్యాయం చేయాలి



ధర్నా నిర్వహిస్తున్న కళాసీలు

రాంబిల్లి: రసూల్ డెకర్ కంపెనీ వద్ద కళాసీలు ధర్నాకు దిగారు. సెజ్‌లో భూములు కోల్పోయిన తాము కళాసీలుగా జీవనం సాగిస్తున్నామని, లోడింగ్, అన్‌లోడింగ్ పనుల్లో తమను తప్పించి ఉపాధి లేకుండా యాజమాన్యం చేసిందని కళాసీలు ఆవేదన వ్యక్తం చేశారు. వీరికి సీఐటీయూ నాయకుడు రొంగలి రాము మద్దతు తెలిపారు. కళాసీలకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు.

ఉపాధి పనులతో ఆర్థిక భద్రత



మల్లవరంలో ఉపాధి కూలీలకు పేమెంట్ స్లిప్‌లు అందజేస్తున్న సర్పంచ్ పిన్నంరాజు వాసు

అచ్యుతాపురం(అనకాపల్లి): రైతులకు, వ్యవసాయ క్షేత్రాలకు ఉపయోగపడే పనులను నాణ్యతతో చేయడంతో పాటు, వ్యక్తిగత ఆర్థిక భద్రత పొందేందుకు ఎన్ఆర్ఈజీఎస్ కూలీలు శ్రమించాలని మల్లవరం సర్పంచ్ పిన్నంరాజు వాసు అన్నారు. బుధవారం ఆయన ఎన్ఆర్ఈజీఎస్ కూలీలకు పేమెంట్ స్లిప్‌లను అందజేశారు. ఈ సందర్భంగా వారి సాధక బాధకాలను విన్నారు. ఈ కార్యక్రమంలో రావి శోభన్‌బాబు,అప్పలరాజు పాల్గొన్నారు.

రేపటి నుంచి 'జగనన్నే మా భవిష్యత్తు'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాబూరావు

కోటవురట్ల : ఈ నెల 7వ తేదీ నుంచి జగనన్నా నువ్వే మా భవిష్యత్ కార్యక్రమం ద్వారా ప్రతి గడపను సందర్శించి మరోసారి తలుపు తట్టనున్నట్టు ఎమ్మెల్యే గొల్ల బాబూరావు తెలిపారు. చౌడువాడలోని చిట్టి పైడిమాంబ అమ్మవారి జాతరకు మంగళవారం రాత్రి వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. సంక్షేమం మరింత చేరువయ్యేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. ఈ కార్యక్రమాన్ని పాయకరావుపేట నియోజకవర్గంలో 7వ తేదీన ప్రారంభిస్తామని తెలిపారు. గురువారం ఉదయం 10 గంటలకు ఎస్.రాయవరం మండలం గోకులపాడులో ఉన్న తులసీ కల్యాణమండపంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, సర్పంచులు, ఎంపీటీసీలతో సమావేశం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకోవాలని, తద్వారా పిల్లలకు బంగారు భవిష్యత్‌ను ఇచ్చినవారమవుతామన్నారు. టీడీపీ మోసపూరిత కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఓ అధికారిగా ప్రజల సమస్యలు తనకు తెలుసునని, ముఖ్యమంత్రి ఆలోచనలకు తోడుగా ప్రజలకు సంక్షేమం అందించేందుకు కృషి చేస్తానన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ మంచి ఫలితాలను ఇచ్చిందని, ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రయోగాత్మకంగా నిర్వహించగా ఇకపై పూర్తి స్థాయిలో ప్రతి గ్రామంలో అమలు కానుందన్నారు. నియోజకవర్గంలో రూ.200 కోట్లతో నిర్మిస్తున్న జల్‌జీవన్ మిషన్ పథకం ఎంతో సంతృప్తిని ఇచ్చిందన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలో ఎక్కడా దాహం కేకలు వినిపించవన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్రీపతిరాజు, శానాపతి రామునాయుడు, పైల నాని, చిన్న పాల్గొన్నారు.

సకాలంలో పింఛను అందేలా...



కె.వెంకటాపురంలో రాత్రి సమయంలో కూడా పింఛను నగదు పంపిణీ చేస్తున్న గృహ సారథులు

కోటవురట్ల: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం ప్రతి లబ్ధిదారుకు సకాలంలో చేరేలా గృహ సారథులు కృషి చేస్తున్నారు. పింఛన్ల పంపిణీలో కూడా వలంటీర్లకు తోడుగా గృహ సారథులు బాధ్యతగా పనిచేయడంతో పాటు సమస్యలు తెలుసుకుంటున్నారు. కె.వెంకటాపురంలో మంగళవారం పింఛన్ల పంపిణీ రాత్రి కూడా కొనసాగించారు. సర్పంచ్ పైల శ్రీదేవి మంగా ఇందిర భవానీ సూచన మేరకు లబ్ధిదారులకు రాత్రి పది గంటల వరకు గృహ సారథులు, వలంటీర్లు పింఛను నగదు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గృహ సారథులు, దేవాడ నాగలక్ష్మి, జీవా పాల్గొన్నారు.

కిడ్నీ రోగికి పెన్షన్ నగదు అందజేత



దయాలసిస్ పెన్షన్ నగదు అందజేస్తున్న సర్పంచ్ శ్రీనుబాబు



జగ్గన్నపేటలో లబ్ధిదారుకు దయాలసిస్ పెన్షన్ అందజేస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం : ఆపదలో ఉన్నవారికి సహాయం చేయడంలో సీఎం జగన్ మోహన్‌రెడ్డి తరువాతే ఎవరైనానని గుడివాడ సర్పంచ్ ధూళి శ్రీనుబాబు అన్నారు. గడివాడ శివారు లక్ష్మీపతిరాజుపేట గ్రామంలో ఎలమంచిలి నాగమణికి డయాలసిస్ పెన్షన్ రూ.10 వేలు మంజూరు కావడంతో బుధవారం ఆమె ఇంటికి వెళ్లి నగదు అందజేశారు. గ్రామ వలంటీర్ అప్పలకొండ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అచ్యుతాపురం(అనకాపల్లి): కిడ్నీ సమస్యకు గురయిన అచ్యుతాపురం మండలంలోని జగ్గన్నపేటకు చెందిన మళ్ల లక్ష్మికు బుధవారం సర్పంచ్ దొడ్డి వెంకటలక్ష్మి కృష్ణ చేతుల మీదుగా పదివేల రూపాయల పెన్షన్‌ను అందజేశారు. ఈమె మూడు నెలల క్రితం కిడ్నీ సమస్యకు గురై డయాలసిస్ చేసుకునేందుకు ఆర్థిక ఇబ్బందులు ఉండడంతో పరిస్థితి గుర్తించిన స్థానిక ప్రజా ప్రతినిధుల ద్వారా పెన్షన్‌ను మంజూరు చేశారు.

వలంటీర్లు, గృహ సారథులు సమన్వయంతో పనిచేయాలి



మాట్లాడుతున్న సచివాలయ మండల కన్వీనర్ పూర్ణచంద్ర గణేష్

మునగపాక: వలంటీర్లు,గృహ సారథులు సమన్వయం చేసుకొని ప్రభుత్వ పథకాలను ఇంటింటికీ తీసుకువెళ్లాలని సచివాలయాల మండల కన్వీనర్ పొలిమేర పూర్ణచంద్ర గణేష్ పిలుపునిచ్చారు. బుధవారం పంచాయతీ కార్యాలయం ఆవరణలో వలంటీర్లు, గృహసారథులతో సమావేశం నిర్వహించారు. గణేష్ మాట్లాడుతూ ఇంతవరకు ప్రభుత్వం ద్వారా లబ్ధిదారులు పొందిన సాయం వివరాలు అడిగి తెలుసుకోవడంతో పాటు సమస్యలు గుర్తించి వాటి పరిష్కారానికి పాటుపడాలన్నారు. సర్పంచ్ దిమ్మల అప్పారావు, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, ఎంపీటీసీలు సూరిశెట్టి రాము, బోడకుర్తి గణేష్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి రామ్మోహనరావు, మార్కెట్‌కమిటీ చైర్‌పర్సన్ పిల్లి కనకలక్ష్మి అప్పారావు పాల్గొన్నారు.

కొత్త రేవుపోలవరంలో 'ఫ్యామిలీ ఫిజీషియన్'

ఎస్.రాయవరం : కొత్తరేవుపోలవరం గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమం గురువారం పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు చేతుల మీదుగా ప్రారంభిస్తున్నట్టు పెనుగొల్లు వైద్యాధికారిణి రాజేశ్వరి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఈ కార్యక్రమం ప్రారంభించే క్రమంలో మండలంలో పెనుగొల్లు పీహెచ్‌సీ పరిధిలో ఎమ్మెల్యే ప్రారంభిస్తారన్నారు.

దాడికి పాల్పడ్డ వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి



పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న దళితులు

నక్కపల్లి : దళిత సామాజిక వర్గానికి చెందిన తనపై ముగ్గురు వ్యక్తులు దాడి చేసి గాయపరిచారని, వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలంటూ నక్కపల్లి మండల పరిషత్ అధ్యక్షురాలు ఏనుగుపల్లి రత్నంతోపాటు పలువురు దళితులు బుధవారం నక్కపల్లిలో ఆందోళనకు దిగారు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు ముగ్గురిపై అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఎంపీపీ ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నక్కపల్లి ఎస్సీ కాలనీలో బుధవారం బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కమిటీ సభ్యులు వీసం రామకృష్ణ సభావేదిక పైకి ముఖ్యులందరినీ ప్రొటోకాల్ ప్రకారం ఆహ్వానిస్తుండగా, ఈలోగా సారిపల్లిపాలెం గ్రామానికి చెందిన యలమంచిలి తాతబాబు, శీరం నర్సింహమూర్తి, ఎస్.రాయవరం మండలం గుర్రాజుపేటకు చెందిన కొర్ని రాజారమేష్ వేదికపైకి రావడంతో అభ్యంతరం వ్యక్తం చేశామన్నారు. దీంతో వారు తమతో ఘర్షణకు దిగా రని, తనపై దాడికి పాల్పడడంతో తాను కింద పడి పోయానని ఎంపీపీ ఫిర్యాదులో పేర్కొన్నారు. దళిత మహిళ అయిన తనపై దౌర్జన్యం చేయడం దారుణమని, ఆ ముగ్గురిపై ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆమెకు మద్దతుగా పలువురు నాయకులు ఆందోళనకు దిగారు. ఎట్టకేలకు పోలీసులు ముగ్గురు వ్యక్తులపై అట్రాసిటీ కేసు నమోదు చేసి ఎఫ్ఐఆర్ కాపీ బాధితురాలికి అందజేశారు. దీంతో ఆమె ఆందోళన విరమించారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



యలమంచిలి దళితవాడలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు, చైర్‌పర్సన్ రమాకుమారి

యలమంచిలి(మునగపాక): అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబురాజు) అన్నారు. యలమంచిలి మున్సిపల్ పరిధిలోని దళితవాడలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సచివాలయం, వలంటీర్ వ్యవస్థలు అందుబాటులోకి రావడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందుతున్నాయన్నారు. ప్రతి పేదవానికి సొంతింటి కల సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతుందన్నారు. అర్హులై ఉండి ప్రభుత్వ పథకాలు రాని వారుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. అన్ని వర్గాల ప్రజలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో మేలు జరుగుతుందన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ పిల్లా రమాకుమారి, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, ఎంపీపీ గోవింద, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు నాగేశ్వరరావు, ఆరెపు గుప్త, కౌన్సిలర్ కట్టుమూరి సుజాత, పట్టణ అధ్యక్షుడు ఎర్రయ్యదొర, కౌన్సిలర్లు పిట్టా సత్తిబాబు, సుంకర మల్లేశ్వరరావు, కొల్లి త్రినాథ్ పాల్గొన్నారు. అనంతరం సచివాలయంలో వలంటీర్లకు సుకుమారవర్మ సమకూర్చిన బ్యాగ్‌లను అందజేశారు.

వై.లోవలో గడప గడపకు మన ప్రభుత్వం నేడు

రాంబిల్లి : వై.లోవ గ్రామంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కె.ఎస్. కొండలరావు తెలిపారు. ఉదయం 6.30 గంటలకు ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు.

'మా నమ్మకం నువ్వే జగన్' కిట్లు పంపిణీ



మామిడివాడలో కిట్లు అందజేస్తున్న శిరీష శ్రీనుబాబు, రామకృష్ణ తదితరులు

రాంబిల్లి: మండలంలో పలు గ్రామాల్లో బుధవారం 'మా నమ్మకం నువ్వే జగన్' కిట్లను గృహసారథులకు అందజేసారు. ఎంపీపీ జి.శిరీషశ్రీనుబాబు, మండల సచివాలయ కన్వీనర్ కొవిరి రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు నెట్టెం సత్యనారాయణ, సర్పంచ్ ఎం.అప్పలనర్స, మండల సోషల్‌మీడియా కన్వీనర్ రేబాక రాము తదితరులు మామిడివాడలో గృహ సారథులకు కిట్లు అందజేసారు.

ఆయుర్వేదంతో దీర్ఘకాలిక వ్యాధులు దూరం

అనకాపల్లి టౌన్: తులసి, తిప్పతీగ, వేప, పసుపు, నేలవేము, నేల ఉసిరి, సొంటి, మిరియాలు, ధనియాలు, జీలకర్ర నిత్య జీవితంలో ఉపయోగించడం వల్ల పలు వ్యాధుల నుంచి విముక్తి లభిస్తుందని ఎన్టీఆర్ వైద్యాలయం ఆయుర్వేద విభాగం వైద్యురాలు కె.లావణ్య అన్నారు. స్థానిక జార్జ్ క్లబ్ ఆవరణలో సీనియర్ సిటిజన్ సంఘం అధ్యక్షుడు కె.వి.గౌరీపతి ఆధ్వర్యంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కరోనా తరువాత ఆయుర్వేదంపై ప్రజలకు అవగాహన పెరిగిందన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులకు ఆయుర్వేదంలో ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. అశ్వగంధ, త్రిఫలచూర్ణం, చవనప్రాస, అగస్త్యహరిత చూర్ణం వంటి వాటిపై ఆమె అవగాహన కల్పించారు. అనంతరం డాక్టర్ లావణ్యను సంఘం సభ్యులు సత్కరించారు. సంఘం కార్యదర్శి బి.ఎల్.ఎన్.శర్మ, కోశాధికారి సత్యనారాయణ, సభ్యులు పాల్గొన్నారు.

నృసింహునికి పుష్పాంజలి నేడు

కొంకోట : స్థానిక వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో గురువారం సాయంత్రం పుష్పాంజలి కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఆలయ అర్చకుడు అత్తిలి కోదండపాణి బుధవారం తెలిపారు. ఈ నెల 1న స్వామి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించామని, ఇందులో భాగంగానే పుష్పాంజలి కార్యక్రమం జరపనున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో ఉత్సవ విగ్రహాలను అందంగా పూలతో అలంకరించి, వివిధ రకాల పండ్లు, మిఠాయిలు నివేదించి, ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించి, తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

9న హనుమాన్ శోభాయాత్ర

అనకాపల్లిటౌన్: పట్టణంలో ఈ నెల 9న హనుమాన్ శోభాయాత్ర నిర్వహించనున్నట్టు హిందూ బంధువుల శోభాయాత్ర కమిటీ సభ్యుడు, హిమశేఖర్ విద్యాసంస్థల అధినేత కొణతాల జనార్దన్ తెలిపారు. సుంకరమెట్ట జంక్షన్ సత్యనారాయణ స్వామి దేవాలయం నుంచి మండలంలో కొత్తూరు ఫ్లై ఓవర్ బ్రిడ్జి హనుమాన్ దేవాలయం వరకు ఈ యాత్ర జరుగుతుందని పేర్కొన్నారు. ఆ రోజు మధ్యాహ్నం 3గంటలకు యాత్ర ప్రారంభమవుతుందని, సుమారు 7వేల మంది భక్తులు పాల్గొంటారని తెలియజేశారు. అనంతరం శోభాయాత్ర కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు బంకుపల్లి సత్యనారాయణ, సభ్యులు డి.డి.నాయుడు, కరణం నూకునాయుడు, పి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మడకపాలెంలో జనసేన భరోసా కార్యక్రమం

మునగపాక: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా జనసేన సేవలందిస్తుందని జనసేన నియోజకవర్గ కన్వీనర్ సుందరపు విజయకుమార్ పేర్కొన్నారు. జనసేన భరోసా కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన మండలంలోని మడకపాలెంలో ఇంటింటికీ వెళ్లి వచ్చే ఎన్నికల్లో జనసేనకు అవకాశం కల్పించాలని ప్రచారం చేశారు. ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పార్టీ మండల అధ్యక్షుడు టెక్కలి పరశురామ్,జన సైనికులు ఆయన వెంట పాల్గొన్నారు.